క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు షెడ్యూల్ విడుదలైనట్లు బుధవారం తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ తెలిపారు. మార్చి 2025న జరగనున్న గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎన్నికలకు ఓటు నమోదు చేస్తున్నామ న్నారు. నవంబర్ 6లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

పసుపు, కుంకుమ పంపిణీ



ముత్తయిదువులకు పసుపు, కుంకుమ పంపిణీ చేస్తున్న కాపు వనిత క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: దేవి శరన్నవరాత్రులు సందర్భంగా పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి మాట్లాడుతూ దేవి నవరాత్రులు సందర్భంగా వనిత క్లబ్ తరుపున ముందుగా లక్ష్మీపార్వతి అమ్మవార్లకు చీర, జాకెటు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించామని అన్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన సుమారు 200 మంది ముత్తయిదువులకు పసుపు, కుంకుమ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్మన్ మంగెన అరుణ, సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ శిద్దిరెడ్డి శైలజారాణి, డాక్టర్ కావలి మౌని తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం పాటించాలి



కొప్పర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రైతులు వ్యవసాయ సాగులో ఎరువుల యాజమాన్యం పాటించడం ద్వారా మేలైన దిగుబడి పొంది అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ సంచాలకులు ఈదా అనిలకుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొప్పర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సర్పంచ్ నల్లి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ ఈ–పంట నమోదు చేయించుకున్న రైతులందురూ తప్పకుండా ఈ–కేవైసీ చేయించుకోవాలని కోరారు. డ్రెయిన్ సమస్యలను తెలుసుకుని రైతులకు నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం పురుగు మందుల సస్యరక్షణ పద్ధతులు సూక్ష్మ పోషకాల విలువల గురించి తెలియజేశారు. అనంతరం మల్లవరం గ్రామంలో కూడా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సర్పంచ్ సంధి సుజాత అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రైతులు పిల్లి కామేశ్వరరారావు, చెలంకూరి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

యలమంచిలి: మండలంలోని ఆర్యపేటకు చెందిన మైనర్ బాలిక మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని బాలిక తండ్రి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నప్రసాదం ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక నరసాపురం పాలకొల్లు రోడ్డులో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం నుంచి ఉచిత అన్నప్రసాదం కార్యక్రమం ప్రారంభించినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చల్లా బాబుల్ స్వామి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతీ సంవత్సరం ఆలయంలో అయ్యప్పస్వామి, భవానీ, శివ మాలధారులకు అన్నదానం ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఈ అన్నదానం అక్టోబర్‌లో ప్రారంభించి డిసెంబర్ వరకూ సుమారు వంద రోజులు పాటు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు దాతలు మేడికొండ శ్రీనివాస రావు దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. ముందుగా అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

యలమంచిలి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలంతా కృషి చేయాలని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అల్లూరి పద్మ వర్మ కోరారు. మండలంలోని పెనుమర్రు కట్టుపాలెం గ్రామాల్లో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు పాకా వెంకట సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమటి రవి కుమార్, మండల అధ్యక్షులు దొంగ నరసింహ కుమార్ పాల్గొన్నారు.

అధిక ఎరువు-పంటకు బరువు

ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే అనర్థమంటున్న అధికారులు

యలమంచిలి: వరి సాగులో నత్రజని (యూరియా) వినియోగం పరిమితికి మించితే అనర్థమేనని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. సంప్రదాయ సాగు విధానంలో రైతులు యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని పలు పరిశీలనల్లో తేలింది. ముఖ్యంగా తోటి రైతులతో పోల్చుకుని వారి పైరు కంటే పచ్చగా లేదన్న కారణాన్ని చూపుతూ కూడా యూరియా వినియోగానికి రైతులు మొగ్గు చూపుతున్నారని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యూరియా అధిక వినియోగం వల్ల లాభానికంటే నష్టమే ఎక్కువని వివరిస్తున్నారు.

40,745 ఎకరాలలో వరిసాగు

ప్రస్తుత సీజన్లో నరసాపురం డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో దాదాపు 40,745 ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. అత్యధికంగా ఎంటీయూ–1318 వరి వంగడం సాగు చేశారు. పంటపై ఎండాకు తెగులు ఎక్కువగా ఉందని అధికారుల పరిశీలనలో తేలింది. ఎండాకు తెగులు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగంపై గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తూ



ఎండాకు తెగులుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. ఈ క్రమంలో యూరియా అధికంగా వినియోగిస్తే ఎదురయ్యే ఇబ్బందులను రైతులకు చెబుతున్నారు. ప్రస్తుతం వరిపైరుపై అక్కడక్కడా ఎండాకు తెగులు కనిపిస్తుంది. ఇది ముఖ్యంగా యూరియా ఎక్కువ కావడం వలన గానీ, 26 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల వస్తుందంటున్నారు. రైతులు పునః పరిశీలించుకుని యూరియా వినియోగాన్ని నియంత్రించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

ఒకవేళ మరీ ఎక్కువగా ఎండాకు తెగులు ఉంటే ప్లాంటామైసిన్, కొసైడ్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఒక గ్రాము ప్లాంటోమైసిన్, రెండు గ్రాముల కొసైడ్ మిశ్రమాన్ని ఒక లీటరు నీటికి కలిపి వినియోగించుకోవాలన్నారు. తద్వారా ఎండాకు తెగులు మరింత వ్యాపించకుండా ఉంటుందని వివరిస్తున్నారు. పూత దశలో గనుక ఎండాకు తెగులు వస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరిస్తున్నారు. యూరియా అధికంగా వినియోగించిన పంట నుంచి వచ్చిన గింజల్లో నూక శాతం కూడా పెరుగుతోందని, ఈ విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. పంట పరిస్థితిని అనుసరించి తగినంత మోతాదులో మాత్రమే ఎరువులను వినియోగించాలన్నారు.

తగిన మోతాదులోనే ఎరువులు వాడాలి



ఏ ఎరువులైనా తగినంత మాత్రమే వినియోగించాలి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను రైతులు వినియోగించడం మానేశారు. దీనిని వినియోగిస్తే తెగుళ్ల వ్యాప్తి బాగా తగ్గుతుంది. పంట కాలంలో రెండుసార్లు ఎంఓపీ వేయాలి. అనవసరంగా వేసే ఎరువుల వలన రైతులకు పెట్టుబడి పెరిగిపోవడం తప్పితే, పంటకు ఏ మాత్రం ఉపయోగం ఉండదు. అధికంగా వాడే ఎరువు మొత్తం వృథాగా భూమిలో ఉండిపోతుంది. ఆకు ఎండు తెగులును పొలంలో గుర్తించాం. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత రైతులకు అవగాహన కల్పించాం.

– చిందులూరి దేవి, మండల వ్యవసాయ అధికారి

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక మీరా స్మారక గ్రంథాలయంలో భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని వైఎన్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం, స్వర్ణాంధ్ర కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్ అన్నారు. భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర కళాశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కామ్రేడ్ మీరా స్మృతిగా ఏర్పాటు చేసిన మీరా గ్రంథాలయంలో అనేక పుస్తకాలు అందుబాటులో ఉండేవన్నారు. ఇటీవల కాలంగా భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి కుట్టు శిక్షణ వంటి ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నారాయణరావు పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థిక వ్యవహారాలపై అవగాహన

మొగల్తూరు: పంచాయతీల ఆర్థిక వ్యవహారాలపై వార్డు సభ్యులకు అవగాహన ఉండాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి సూచించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభయాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉపసర్పంచ్, ప్రతీ పంచాయతీ నుండి ఇద్దరు వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహనతో ఉండాలని సూచించారు. అనంతరం రెండు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌లకు సర్టిఫికెట్‌లు అందించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, రిసోర్స్ పర్సన్ కేబీఎన్ రాజు, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, పంచాయతీ సభ్యులకు నిర్వహించిన రిఫ్రెష్మెంట్ ట్రెనింగ్ రెండు రోజులు శిక్షణా తరగతులు బుధవారం ముగిసినట్లు ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. పంచాయతీలపై అవగాహన, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద సృష్టి, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. సహకరించిన ఉప సర్పంచ్‌లకు, పంచాయతీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



మొగల్తూరు: శిక్షణలో పాల్గొన్న వార్డు సభ్యులు, అధికారులు

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పంచాయతీ పరిపాలనలో పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధికి కీలకంగా పనిచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, మాస్టర్ ట్రైనీ తాళ్ల మూర్తిబాబు కోరారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను మూర్తిబాబు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ, మంచినీరు సరఫరా, వీధి లైట్లు నిర్వహణ ప్రాధాన్యతా అంశాలని వివరించారు. వర్షాకాలంలో పారిశుధ్యం లోపిస్తే సీజనల్ వ్యాధులు ప్రజలను పీడిస్తాయన్నారు. మంచినీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు ఫిల్టర్ చేసి ప్రజలకు సరఫరా చేయాలన్నారు. మంచినీరు సరఫరాలో ప్రతీ రోజు క్లోరినేషన్ పరీక్షలు ఆరోగ్య సిబ్బంది చేస్తున్నారో లేదో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో టీటీటీ నాగయ్య పాల్గొని పాలకవర్గ సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

కిక్ ఇవ్వని మద్యం దరఖాస్తులు

పెనుగొండ: మద్యం నూతన విధానంలో దరఖాస్తులు అరకొరగా పడడంతో ప్రభుత్వం అంచనాలు తలకిందులయ్యాయి. ఆచంట నియోజకవర్గంలో దరఖాస్తుల జోరు కరువైంది. ప్రభుత్వం తొలివిడత ప్రకటించిన విధంగా బుధవారం సాయంత్రానికి దరఖాస్తుల గడువు ముగియాలి. దీనికి అనుగుణంగా మద్యం దుకాణాలకు దరఖాస్తుల చేయాలనుకునే వారందరూ ఆన్‌లైన్ చేసుకోవడంతో పాటు, కొందరు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకున్నారు. ఐదేళ్ల తరువాత నూతన విధానం దుకాణాలు కేటాయింపు జరుగుతుండడంతో దరఖాస్తులు ఇబ్బడిముబ్బడిగా వస్తాయని ప్రభుత్వానికి ఆదాయంకు కొదవ ఉండదని అంచనా వేశారు. అయితే అంచనాలు తలకిందులయ్యాయి. మద్యం దుకాణాల కేటాయింపు దరఖాస్తులు అనుకొన్న స్థాయిలో దాఖలు కాక పోవడంతో ఇతర కారణాలు చూపుతూ దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 11 వ తేదీ వరకూ పెంచుతూ ప్రభుత్వం ప్రకటన చేసింది. మరికొన్ని దరఖాస్తులు పెరుగుతాయన్న ఆశాభావంతో ఉంది. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో నాలుగు షాపులకు 255, పోడూరు మండలంలో నాలుగు షాపులకు 127, పెనుగొండ మండలంలో తొమ్మిది షాపులకు 94, పెనుమంట్ర మండలంలో ఆరు షాపులకు 66 దరఖాస్తులు మాత్రమే దాఖలు అయ్యాయి. గడువు పెంచడంతో వీటి సంఖ్య కొద్దిపాటిగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే సిండికేట్లు అన్నీ దరఖాస్తు చేయడం పూర్తి కావడంతో, వాటి సంఖ్యను పెంచుకోవడం కానీ, వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకునే వారు కాని దరఖాస్తు చేయడం వలన కొద్దిపాటిగానే పెరిగే అవకాశం ఉంది. అధికారుల అంచనాలకు అనుగుణంగా పెరిగే అవకాశం లేదని మద్యం వ్యాపారులు తేల్చి చెబుతున్నారు.



దరఖాస్తులకు వెనుకంజ

మద్యం దుకాణాలకు గతం కన్నా పోటీ తగ్గింది. దీనికి ప్రధాన కారణం ప్రజా ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించాలనే ప్రచారం విస్తృతంగా జరగడంతో కొందరు వ్యాపారులు వెనుకడుగు వేశారు. సిండికేట్లు మాత్రమే దరఖాస్తులు దాఖలు చేసారు. వ్యక్తిగతంగా సొంతంగా వేసే దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆదాయానికి గండి పడింది.

11వ తేదీ వరకూ అవకాశం

దరఖాస్తులు దాఖలు చేసుకోవడానికి ఈనెల 11వ తేదీ వరకూ పొడిగించడం జరిగిందని తణుకు ఎక్సైజ్ ప్రోహిబిషన్ సీఐ మణికంఠరెడ్డి తెలిపారు. తొలుత ప్రకటించిన విధంగా 9వ తేదీ నాటికి ముగుస్తుందని భావించినా, ప్రభుత్వం గడువును పొడిగించింది. 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు.

24 మద్యం షాపులకు 511 దరఖాస్తులు

నరసాపురం: నరసాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 24 మద్యం షాపులకు సంబంధించి బుధవారం నాటికి 511 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ ఎస్ రాంబాబు చెప్పారు. నరసాపుర టౌన్‌లో 5 షాపులకు 126 అప్లికేషన్స్, రూరల్‌లో9 షాపులకు 82 అప్లికేషన్స్, మొగల్తూరులో 5 షాపులకు 156 అప్లికేషన్స్, యలమంచిలో 5 షాపులకు 147 అప్లికేషన్స్ అందాయన్నారు. మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం 11వ తేదీ రాత్రి 7 గంటలు వరకూ పెంచిందన్నారు. దరఖాస్తుదారులకు ఏమైనా సందేహాలు ఉంటే ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

సరస్వతీ నమస్తుభ్యం



పెనుగొండ: సిద్ధాంతంలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం: స్టీమర్‌రోడ్డులో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



పాలకొల్లు సెంట్రల్: సరస్వతి దేవి పూజలో పాల్గొన్న విద్యార్థులు

పెనుగొండ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రం సందర్భంగా వాడవాడలా చిన్నారులు సరస్వతీ పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయాల్లోనూ, శరన్నవరాత్రి చలువ పందిళ్లలోనూ అమ్మవార్లు సరస్వతీదేవిగా దర్శనం ఇచ్చారు. పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు సామూహిక పూజలు నిర్వహించడానికి బారులు తీరారు. పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లు సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలోనూ మరకత శిల వాసవీ మాత సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చారు. పరిసర గ్రామాలకు చెందిన చిన్నారులు సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. పెనుగొండ కంచి కామాక్షీ దేవి ఆలయంలోనూ, సిద్ధాంతం జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలోనూ సామూహిక పూజలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ ఆలయంలోనూ అమ్మవార్లు సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చి పూజలందుకున్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలం వివిధ గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఏడో అమ్మవారిని సరస్వతిరూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుమంట్ర శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద, పల్లపువీధి శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయాల వద్ద వేదపండితులు చిట్టూరవి ఆధ్వర్యంలో విద్యార్థులతో సరస్వతీపూజలు నిర్వహించారు. నత్తారామేశ్వరం విజయదుర్గ ఆలయంలో మార్టురులోని మావుళ్లమ్మ, శ్రీకంచికామాక్షి అమ్మ, శ్రీకనకదుర్గమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద సరస్వతి పూజలు జరిగాయి. నెగ్గిపూడిలో శ్రీకనకదుర్గమ్మ, వనుములమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమ వద్ద విద్యార్థులతో సరస్వతి పూజలు నిర్వహించారు. పెనుమంట్రలోని శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మీదంపతులు ఆలయాన్ని సందర్శించి బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దంపతులు ఇరువురు అమ్మవారికి పట్టుచీరలు సమర్పించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారిని బుధవారం సరస్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక బోణం శివన్నారాయణ కాలిబాట వంతెన వద్ద ఉన్న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించగా చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కనకదుర్గమ్మ ఆలయంలో చిన్నారులకు పలకలు పంపిణీ చేయగా, కుక్కలరారి తోటలోని అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు.

నరసాపురంలో..

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు చివరిదశకు చేరుకున్నాయి. బుధవారం మూలా నక్షత్రం పుసర్కరించుకుని అన్ని మండపాల వద్ద, దేవీ ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సరస్వతీ పూజలు, విద్యాభ్యాసాలు నిర్వహించారు. పండ్ల మార్కెట్ వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారు కాళరాత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 108 మంది మహిళలతో ప్రత్యేక కుంకుమపూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనాఆరయణ, గునిశెట్టి సత్యనారాయణ, గునిశెట్టి శ్రీనివాస్, చిట్టూరి కృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. గోల్డ్‌మార్కెట్ వద్ద స్వర్ణకారులసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారిని వెండి వస్తువులతో అలంకరించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఏడో రోజుకూడా దేదీప్యమానంగా కొనసాగాయి. బుధవారం సరస్వతీదేవి అవతారం కావడంతో దేవాలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్ల చలువ పందిళ్ల వద్ద సరస్వతీ దేవి పూజలు చేశఋరు. కొప్పర్రు, కె.బేతపూడి, ఎల్బీచర్ల గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కొప్పర్రు సెంటర్‌తో పాటు లిఖితపూడిలోని దానేశ్వరి అమ్మవారు, లక్ష్మణేశ్వరంలోని గోగులమ్మ, కె.బేతపూడి, సారవ గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. చిట్టవరం గ్రామంలోని అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చిన్న కూరగాయల మార్కెట్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవిశరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో నిర్వహించిన ఈ పూజల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముత్యాల శ్రీనివాస్, ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించాలి

పెనుగొండ: రాష్ట్రంలో దళితవాడల్లో సమస్యలు సత్వరం పరిష్కరించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆచంట మండలం కందరవల్లి పెదపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి డ్రెయినేజీ సమస్యలు, ఇతర సమస్యలను పరిశీలించారు. దళితవాడలు అభివృద్ధికి నోచుకోక మురికి కూపాలుగా మారుతున్నాయన్నారు. పెదపేటలో డ్రయినేజీ వ్యవస్థ మరీ దారుణంగా ఉందన్నారు. అధికారులు తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ దళిత వాడలోనూ డ్రెయినేజీ వ్యవస్థను అభివద్ధి చేయడంతో పాటు, కమ్యూనిటీ భవన నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి పాపర్తి కృపానాథ్, నల్లి జయరాజ్, రావి నాగరాజు, బద్ది అంతర్వేది, చికిలే సురేష్, బోళ్ల ప్రసాద్, బత్తుల రాముడు తదితరులు పాల్గొన్నారు.



కందరవల్లి దళిత వాడలో మాట్లాడుతున్న రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నల్లి రాజేష్

బాధితుడుకి ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పెదమామిడిపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పరువు ఘటోద్కజుడుకి సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. దీంతో గ్రామ మెగా పవర్ ఫ్యాన్స్ సభ్యులు స్పందించారు. రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని, బియ్యం, దుస్తులు బాధితుడుకి బుధవారం అందజేశారు. గ్రామ మాజీ ఎంపీటీసీ గుబ్బల సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామ లింగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పాలకొల్లు సెంట్రల్: క్రీడలు మానశిక ఉల్లాసాన్ని, శరీరధారుడ్యాన్ని పెంపొందిస్తాయని నరసాపురం ఆర్‌డీఓ దాసి రాజు అన్నారు. బుధవారం స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, టౌన్‌హాల్ సంయుక్తంగా నిర్వహించిన రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల ద్వారా కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తే రెండింటిలో ఏదో ఒక రంగం నుంచి ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో అండర్–8 విభాగంలో బాలబాలికలు సంయుక్తంగా ఇ.ధర్షిక్, టీఐ అమ్మన్ పాలకొల్లుకు చెందిన ఇద్దరు ప్రతమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అండర్–10 బాలురు విభాగంలో ఎ.లక్ష్మిత్ చౌదరి (విశాఖపట్నం), సీహెచ్ విహార్ (గుంటూరు), అండర్–12 భువన్ దీరజ్ (పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు), ఏ వీరన్ (విశాఖపట్నం), అండర్–14 ఐ దుర్గా శ్రీ, అఖిల్ (పశ్చిమగోదావరి, పాలకొల్లు), ఎండి కుర్షీద్ (ప్రకాశం), బాలికల అండర్ 10 విభాగంలో పి అతర్వ (గుంటూరు), పీపీసుక్తిశ్రీ (పల్నాడు), అండర్–12 ఎస్ లేఖ్యశ్రీ (పశ్చిమగోదావరి, పాలకొల్లు), పి అతర్వ (గుంటూరు), అండర్–14 ఎ.శ్రీ వైశాలి (విజయవాడ), ఎస్ లేఖ్యశ్రీ (పశ్చిమగోదావరి, పాలకొల్లు) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలకు దాసి రాజు, పట్టణ సిఐ కోలా రజనీకుమార్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రుద్రరాజు సత్యనారాయణరాజు, ఏ రమేష్‌బాబు, బూన్‌రాజు, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వీరవల్లి మోహన్ కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.



విజేతలతో ఆర్‌డివో దాసి రాజు, సీఐ రజనీకుమార్